సాక్షి
బాపట్ల

ఆదివారం । 14 । ఏప్రిల్ । 2024



కాళికామాత ఆలయ వార్షికోత్సవం

మాచవరం: మండలంలోని పిన్నెల్లిలో ఉన్న కాళికాదేవి ఆలయ వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు.



చెరువులకు సాగర్ జలాలు

ఫిరంగిపురం: మండలంలోని 11 గ్రామాల్లోని చెరువులను సాగర్‌జలాలతో నింపుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామకృష్ణ తెలిపారు. చెరువులను శనివారం ఆయన పరిశీలించారు.



ఈవీఎంలు తరలింపు

నరసరావుపేట: స్థానిక మార్కెట్ యార్డులో ఉన్న గోడౌన్ నుంచి నియోజకవర్గాల వారీగా ఈవీఎంలను తరలించే ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ శనివారం పర్యవేక్షించారు.





గుంటూరు జిల్లా మంగళగిరిలో శనివారం నిర్వహించిన చేనేత కార్మికుల ముఖాముఖి కార్యక్రమంలో వేదికపై నుంచి అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. పక్కన రీజనల్ కో ఆర్డినేటర్ అయోధ్యరామిరెడ్డి, ఎంపీ అభ్యర్థి కిలారి, ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు, అభ్యర్థి లావణ్య, గంజి చిరంజీవి, హాజరైన కార్మికులు

జై కొట్టిన గుంటూరు

- జిల్లాలో ముగిసిన మేమంతా సిద్ధం యాత్ర
- చేనేతలతో ముఖాముఖి
- అభిమాన నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జేజేలు
- యువకుల బైక్ ర్యాలీలు
- జాతీయ రహదారిపై బారులు తీరిన జనం
- అడుగడుగునా ఘన స్వాగతం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు గుంటూరు జిల్లా జై కొట్టింది. బస్‌యాత్రకు జిల్లాలో అనూహ్య స్పందన లభించింది. శనివారం నంబూరు క్రాస్ రోడ్డు నుంచి యాత్ర మొదలైంది. జిల్లాకు చెందిన పలువురు బీజేపీ, జనసేన నేతలు జగన్ సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం బయలుదేరిన ఆయనకు వేలాదిమంది స్వాగతం పలికారు. రెయిన్ ట్రీపార్కు వద్ద గజమాలతో స్వాగతం లభించింది. కాజా టోల్‌గేట్ వద్ద సీఎం వైఎస్ జగన్‌కు గజమాలతో స్వాగతం పలికారు. అక్కడి నుంచి యువకులు ర్యాలీగా బస్సు యాత్రకు ముందు నడిచారు. మంగళగిరి బైపాస్ వద్ద బైక్ ర్యాలీతో కార్యకర్తలు స్వాగతం పలికారు.



నంబూరు వద్ద సీఎం వైఎస్ జగన్‌ను చూసేందుకు తరలివచ్చిన జనసందోహం

బీసీల సీట్లలో బాబు, లోకేష్ పోటీ

వైఎస్ జగన్ అక్కడి నుంచి నేరుగా సీకే కన్వెన్షన్ హాల్ వద్దకు చేరుకున్నారు. అక్కడ చేనేతలను ఉద్దేశించి ప్రసంగించారు. మంగళగిరిలో చేనేతలు ఎక్కువ ఉన్నందున ఆర్కేతో మాట్లాడి చేనేత కుటుంబానికి చెందిన నా చెల్లెమ్మ మురుగుడు లావణ్యకు టికెట్ ఇచ్చామని జగన్ చెప్పారు. ఆర్కే కూడా సానుకూలంగా స్పందించారని కొనియాడారు. మరోవైపు బీసీలు ఎక్కువగా ఉన్న సీట్లలోనే చంద్రబాబునాయుడు, ఆయన కొడుకు లోకేష్ పోటీ చేస్తున్నారని విమర్శించారు. లోకేష్ డబ్బులు పంచి గెలవాలనుకుంటున్నారని, ఆయన ఇచ్చే డబ్బులు తీసుకుని ఓటు మాత్రం మంచి చేసే లావణ్యకు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు.

కొనుగోలు చేసైనా ఇళ్ల స్థలాలు ఇస్తాం...

మంగళగిరి నియోజకవర్గ పేద ప్రజలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలపై కోర్టులకు వెళ్లి చంద్రబాబునాయుడు, లోకేష్ అడ్డుకోవడాన్ని ఆయన ప్రస్తావించారు. పేద మహిళల చేతుల్లో పది నుంచి రూ.15 లక్షల విలువైన భూమిని పెట్టాలని అనుకున్నామని దాన్ని సుప్రీం కోర్టు వరకూ వెళ్లి అడ్డుకున్నారని చెప్పారు. ఆరు నెలల్లో సమస్య పరిష్కారం కాకపోతే డబ్బులతో స్థలం కొని అయినా నియోజకవర్గ ప్రజలందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తానని ఆయన హామీ ఇచ్చారు. పేదలకు లబ్ధి జరగకుండా అడ్డుకున్న వారు ఓట్ల కోసం వస్తే గట్టిగా నిలదీయాలని పిలుపునిచ్చారు. చేనేత వర్గాలకు అన్ని విధాలా లబ్ధి చేకూరుస్తున్నామని, భవిష్యత్‌లో మరింతగా వారికి లబ్ధి చేకూరుస్తామని ఆయన హామీ ఇచ్చారు.

ఘనంగా వీడ్కోలు

సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో బస్ యాత్ర గుంటూరు జిల్లా నుంచి ఎన్టీఆర్ జిల్లాలోకి ప్రవేశించింది. వీడ్కోలు చెప్పేందుకు గుంటూరు జిల్లా ప్రజానీకం పెద్ద ఎత్తున రాగా, స్వాగతం పలికేందుకు ఎన్టీఆర్ జిల్లా అభిమానులు కూడా తరలిరావడంతో కృష్ణమ్మ సాక్షిగా కనకదుర్గవారధిపై జనప్రవాహం ఉరకలెత్తింది.

జనసంద్రంగా తాడేపల్లి

బస్సు యాత్ర కొలనుకొండ, వడ్డేశ్వరం, కుంచనపల్లి మీదుగా తాడేపల్లి చేరుకుంది. తాడేపల్లి జంక్షన్ జనసంద్రంగా మారింది. బస్సుయాత్రకు మేమంతా సిద్ధమంటూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అక్కడి ప్రజలు ఘనస్వాగతం పలికారు. మహిళలు గుమ్మడికాయలతో దిష్టితీసి, హారతులతో స్వాగతం పలికారు. తాడేపల్లి జంక్షన్‌లో ముఖ్యమంత్రి జగన్ బస్సుయాత్రకు ఆయన సతీమణి వైఎస్ భారతి సంఘీభావం ప్రకటించారు. తాడేపల్లి జంక్షన్‌లో జనంతో కలిసి సాధారణ మహిళలా నిలబడిన వైఎస్ భారతి ముఖ్యమంత్రికి అభివాదం చేశారు. ప్రతిగా బస్సులో నుంచి ముఖ్యమంత్రి కూడా అభివాదం చేస్తూ ముందుకు సాగిపోయారు.

అక్రమ మద్యం సరఫరాపై దృష్టి సారించండి

- సెబ్ జాయింట్ కమిషనర్ డాక్టర్ బి.అరుణ్‌రావు
- అధికారులతో సమీక్ష

బాపట్లటౌన్: అక్రమ మద్యం సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ కమిషనర్ డాక్టర్ బి.అరుణ్‌రావు తెలిపారు. సెబ్ కమిషనర్ ఎం.రవిప్రకాష్ ఆదేశాల మేరకు జాయింట్ కమిషనర్ శనివారం బాపట్ల సెబ్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. తొలుత ఎన్నికల్లో భాగంగా, ఎన్నికల సమయంలో సెబ్ నేరాల అదుపునకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌పై సెబ్ స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బందికి తగు సూచనలు చేశారు. డాక్టర్ బి.అరుణ్‌రావు మాట్లాడుతూ బాపట్ల సెబ్ స్టేషన్‌లో నమోదు చేసిన కేసుల వివరాలను పరిశీలించి తదుపరి తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. అక్రమ మద్యం నిల్వలు ఉన్న గోడౌన్లు, అక్రమ మద్యం సరఫరా కేసులలో జీఆర్‌వో స్టాఫ్‌ను లింక్ చేయాలని, అక్రమ కల్లు అమ్మకాలపై, నాటుసారాయి తదితర నేరాలపై నిఘా పెట్టి వాటిని గుర్తించి కేసులు నమోదు చేయాలన్నారు. వాహన తనిఖీలు నిర్వహించి, పొరుగు రాష్ట్రాల నుంచి ఎటువంటి మద్యం రవాణా జరగకుండా చూడాలన్నారు. ఏ రాజకీయపార్టీలకు కొమ్ము కాయకుండా నిష్పక్షపాతంగా మద్యం అక్రమ నిల్వలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో మంగళగిరి ఏఈఎస్ జి.నరసింహారావు, జిల్లా సెబ్ అధికారి, సీహెచ్‌వి.మహేష్‌కుమార్, సెబ్ సూపరింటెండెంట్ గోవిందనాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సెబ్ జాయింట్ కమిషనర్ డాక్టర్ బి.అరుణ్‌రావు

ప్రజాగళానికి ప్రజలు కరువు

- గంటలకొద్ది వేచిచూసినా రాని జనం
- బాబు ప్రసంగానికి కనిపించని స్పందన
- హామీలు గుప్పిస్తున్న చంద్రబాబు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: ఎన్నికల వేళ ప్రజాగళం పేరుతో జిల్లాలో చంద్రబాబు నిర్వహించిన సభలకు జనం కరువయ్యారు. వాహనాలు పెట్టి కూలీ, మద్యం, బిర్యానీ ప్యాకెట్లు పంచినా బాబు సభలకు జనం రావటంలేదు. వచ్చిన కొద్ది మంది జనం కూడా బాబు ప్రసంగం మొదలు పెట్టగానే వెనుదిరిగి వెళ్లిపోతున్నారు. దీంతో ఆయన గంటపాటు చెప్పే ఊకదంపుడు ప్రసంగం పూర్తయ్యే లోపు సభా ప్రాంగణం ఖాళీ అవుతోంది. బాబు ప్రసంగంలో కొత్తదనం లేకపోవడంతో జనం అసహనానికి గురవుతున్నారు. ఎలాగైనా సరే జనాన్ని మరోమారు వంచించి అధికారం దక్కించుకోవాలన్న తాపత్రయం తప్ప మరొకటి కనిపించటంలేదు. ఇందుకోసం ఆయన అమలుకు సాధ్యంకాని హామీలను గుప్పిస్తున్నారు. అవి కూడా ఒక సభలో ఒక రకంగా మరో సభలో వేరో రకంగా చెబుతున్నారు. దీంతో ఏది అమలు చేస్తారో జనానికి అర్థంకాని పరిస్థితిలో సభకు వచ్చినవారు తలలు పట్టుకుంటున్నారు.

ఇప్పటివరకు జిల్లాలో పర్చూరు, బాపట్ల, వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లో ప్రజాగళం పేరుతో నిర్వహించిన సభల్లో చంద్రబాబు పాల్గొన్నారు. సభలు జనం లేక వెలవెలబోయాయి. వాహనాలు పెట్టి తరలించినా మొక్కుబడిగా కూడా జనం హాజరు కాలేదు. దీంతో చంద్రబాబు ఆ సభల్లో సభాప్రాంగణానికి రెండు గంటలు ఆలస్యంగా రావాల్సి వచ్చింది.



వెలవెలబోతున్న బాపట్లలో జరిగిన ప్రజాగళం సభ

పొంతన లేని హామీలు

ప్రజాగళం సభల్లో చంద్రబాబు ఆచరణకు సాధ్యం కాని హామీలను పొంతన లేకుండా చెప్పడంతో సభకు వచ్చిన జనం తలలు పట్టుకుంటున్నారు. ఏడాదిలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తానంటూ వేమూరు నియోజకవర్గం కొల్లూరు సభలో చెప్పిన చంద్రబాబు అదే రోజు గంట తర్వాత జరిగిన రేపల్లె సభలో 25 లక్షల ఉద్యోగాలంటూ ప్రకటించారు. తనను గెలిపిస్తే సంక్షేమ పథకాలు వస్తాయని బాబు చెప్పినప్పుడల్లా జనం జగన్‌ను గుర్తు చేసుకోవడం గమనార్హం. ఆడబిడ్డలకు దేశమంతా గ్యాస్ ఇచ్చింది, మరుగుదొడ్లు కట్టించింది తానేనని, వరకట్నం పోయి రివర్స్ కట్నం వచ్చింది తనవల్లేనని బాబు చెప్పిన మాటలు విని జనం నవ్వుకుంటున్నారు. జగన్ ప్రభుత్వంలో పంటల బీమా లేదు, ధాన్యం కొనడంలేదు అంటూ.. రైతు వ్యతిరేకిగా ముద్రపడ్డ చంద్రబాబు విమర్శలు చేయడంపైనా జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కూటమిలో కుదరని సమన్వయం

కూటమి నేతల మధ్య సమన్వయం కుదరడం లేదు. అటు బీజేపీ, ఇటు జనసేన పార్టీలకు చెందిన నేతలు ప్రజాగళం వేదిక ఎక్కి పాటోలు దిగుతున్నారు తప్పించి వారి కార్యకర్తలు కూడా బాబు సభలకు హాజరుకావటంలేదు. మాకు పెత్తనం ఇవ్వటంలేదని కొందరు, వాహనాలు ఏర్పాటు చేయలేదని మరి కొందరు సభలకు జనాన్ని తరలించేందుకు అవుతున్న ఖర్చు మొత్తాన్ని కూటమి పార్టీలకు అప్పగించలేదని ఆ పార్టీల కార్యకర్తలు, నేతలు బాహాటంగానే పచ్చపార్టీపై విమర్శలు గుప్పిస్తున్నారు. పైపెచ్చు పోటీలో ఉన్న పచ్చపార్టీ అభ్యర్థులు కూటమి పార్టీలను పట్టించుకోక తమపని తామే చూసుకుంటుండటంతో అటు కూటమి పార్టీలు అంటీ ముట్టనట్లు వ్యవహరిస్తున్నాయి.

జిల్లాలో కూటమికి ఒక్కసీటు లేదు

బాపట్ల జిల్లాలో కూటమిలో భాగస్వాములుగా ఉన్న జనసేన, బీజేపీలకు ఒక్కసీటు కేటాయించలేదు. కేవలం పచ్చపార్టీనే అన్ని స్థానాల్లో పోటీ చేసింది. జిల్లాలో బీజేపీకి మొక్కుబడిగా కేడర్ ఉన్నప్పటికీ బాపట్ల సీటు కేటాయించాలని కోరింది. జనసేన చీరాల సీటును ఆశించింది. అయినా పచ్చ పార్టీ జిల్లాలో కూటమి పార్టీలకు సీటివ్వక మొండిచేయి చూపింది. దీంతో ఆ రెండు పార్టీల కేడర్ పచ్చపార్టీ తీరుపై ఆగ్రహంతో ఉంది. ఈ క్రమంలో వారి పార్టీల కార్యకర్తలు చంద్రబాబు సభలకు వెళ్లకపోగా ఆ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా నిలవడంలేదన్న ప్రచారం ఉంది.

పిరికిపంద చర్యలను పచ్చమూక మానుకోవాలి




చంద్రబాబు ఫ్లెక్సీలను దహనం చేసి, నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

రేపల్లె రూరల్: పిరికిపంద చర్యలను పచ్చమూక మానుకోవాలని రేపల్లె పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన దాడిని ఖండిస్తూ.. పార్టీ నాయకులు శనివారం అర్ధరాత్రి రేపల్లె పట్టణంలోని రాజ్యలక్ష్మి థియేటర్ సెంటర్‌లో చంద్రబాబు ఫ్లెక్సీలను దహనం చేసి, నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అల్లం శెట్టి శ్రీనివాసరావు, యలమనేని కిషోర్, వీరెల్ల అంజిబాబు, ఆళ్ల రాజపాల్, చిత్రాల ఒబేదు ఉన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోండి

జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా

బాపట్ల: తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సాగర్ నీటి విడుదల, విద్యుత్ సరఫరా, ఉపాధి హామీ పథకం అమలు తీరుపై జిల్లా, మండల స్థాయి అధికారులతో శనివారం ఆయన బాపట్ల నుంచి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పశ్చిమ కృష్ణా డెల్టా, సాగర్ కాల్వల ద్వారా ఈనెల 17వ తేదీ వరకు తాగునీరు విడుదలవుతుందని తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన తాగునీటి చెరువులన్నిటిని నూరు శాతం నింపాలన్నారు. బాపట్లకు నీరు విడుదల చేసినట్లు వివరించారు. తాగునీటి పైపులైన్లు, చెరువుల లీక్‌లను పూర్తిగా అరికట్టాలన్నారు. ప్రజల తాగునీటి అవసరాల కోసం విడుదల చేసిన నీటిని పంట పొలాలు, చేపల చెరువులకు దారిమళ్లించకుండా పర్యవేక్షించాలన్నారు. సాగర్ కాల్వలపై పోలీసులు గస్తీ తిరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ వకుల్ జిందాల్‌ను కలెక్టర్ ఆదేశించారు. జల వనరులను సంరక్షించుకోవడానికి మండల స్థాయిలో రెవెన్యూ, నీటి సరఫరా విభాగం, ఇరిగేషన్, పంచాయతీశాఖలతో ప్రత్యేక బృందాలను నియమించామన్నారు. గ్రామస్థాయిలో ఏర్పాటుచేసిన టీమ్‌లో వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, పోలీసులు ఉన్నారన్నారు. పైపులు, మోటార్లు వినియోగించకుండా టీమ్‌లు కాల్వల గట్లపై పహారా కాయాలన్నారు. గుండ్లకమ్మకు నీరు విడుదల చేస్తామన్నారు. ఉపాధి హామీ పనులు విరివిగా చేపట్టాలని తెలిపారు. ప్రతి రోజూ 40 వేల మంది కూలీలకు పనులు కల్పించాలని లక్ష్యం కాగా ఆ మేరకు నిరుపేదలకు ఉపాధి కల్పించాలన్నారు. కనీసం రూ.300లకు కూలి తగ్గకుండా చూడాలన్నారు. పనిచేసిన కూలీలకు సకాలంలో నగదు చెల్లింపులు ఉండాలన్నారు. అన్ని గ్రామపంచాయతీలలో ఉపాధి పనులు చేపట్టాలన్నారు. యద్దనపూడి, చుండూరు, సంతమాగులూరు, చెరుకుపల్లి, చినగంజాం మండలాలలో పురోగతి లేకపోవడంపై సంబంధిత ఎంపీడీవోలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చూడాలన్నారు. సమస్యలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జలవనరుల శాఖ, పంచాయతీ, పోలీస్ శాఖ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



టీడీపీ సానుభూతిపరుల వాగ్వాదం

మైనింగ్ అధికారుల విధులకు ఆటంకం

బల్లికురవ: మైనింగ్ అధికారులపై గ్రానైట్ రాయిని తరలించే టీడీపీ సానుభూతిపరులు వాగ్వాదానికి దిగారు. ఈ ఘటన మండలంలోని వేమవరం జంక్షన్ వద్ద శుక్రవారం అర్ధ రాత్రి జరిగింది. సమాచారం మేరకు.. బపట్ల జిల్లా మైన్స్ టెక్నికల్ అసిస్టెంట్ భాస్కర్ రెడ్డి గ్రానైట్ ముడి రాయిని తరలించే లారీల పర్మిట్లను తనిఖీ చేసేందుకు వచ్చారు. ఈ క్రమంలో రెండు లారీలకు సంబంధించి అనుమతి పత్రాలు లేకపోవడంతో అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. మరో లారీ పర్మిట్‌ను తనిఖీ కోసం తరలింపుదారులను అధికారి అడుగ్గా 'మీరెవరు..? మైనింగ్ అధికారులని మా కేంటి రుజువు.. !' అంటూ టీడీపీ సానుభూతి పరుడు ప్రశ్నించాడు. ఈ విషయమై మైనింగ్ ఏడీ రాజేశ్ కుమార్‌ను 'సాక్షి' వివరణ కోరగా తమ శాఖకు సంబంధించిన టెక్నికల్ అసిస్టెంట్ భాస్కర్‌రెడ్డి తనిఖీల కోసం బల్లికురవ ప్రాంతానికి వచ్చారని, పర్మిట్ లేని రెండు లారీలను గుర్తించి స్టేషన్‌కు తరలించామని తెలిపారు. మరో లారీకి పర్మిట్ సమయం ఉండడంతో వదిలేసినట్లు వివరించారు. అనుమతి లేకుండా గ్రానైట్ ముడిరాళ్లు, మీటరు రాళ్లు తరలించడం నేరమని ఆయన హెచ్చరించారు.

అరటి తోట దగ్ధం

రూ.4 లక్షల వరకు నష్టం



సంతమాగులూరు (అద్దంకి): గుర్తుతెలియని దుండగులు నిప్పంటించడంతో అరటి తోట దగ్ధమైంది. ఈ ఘటన మండలంలోని కొప్పరంలో శనివారం జరిగింది. సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన సయ్యద్ సుభాని అనే రైతు తన నాలుగు ఎకరాల్లో అరటి పంట వేశాడు. ఈ క్రమంలో శనివారం గుర్తుతెలియని వ్యక్తులు దానికి నిప్పంటించడంతో పూర్తిగా కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మిగిలిన పొలాలకు వ్యాపించకుండా మంటలు అదుపులోకి తెచ్చారు. అరటి తోట కాలిపోవడంతో రూ.4 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. నిప్పంటించడం వల్ల ఈ అగ్ని ప్రమాదం సంభవించినట్లు రైతు భావిస్తున్నాడు.

కూటమిని బంగాళాఖాతంలో కలిపేందుకు సిద్ధం

వైఎస్సార్ సీపీ రేపల్లె అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్



బెల్లంకొండవారిపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్

నిజాంపట్నం: రానున్న ఎన్నికల్లో జగనన్న దెబ్బకు టీడీపీ కూటమి బంగాళాఖాతంలో కలవడం ఖాయమని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్ పేర్కొన్నారు. మండలంలోని ఆముదాలపల్లి పంచాయతీ బెల్లంకొండవారి పాలెం, క్రోసూరువారి పాలెం గ్రామాల్లో ఆయన శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, అమలు పరచిన నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించనున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సీఎం జగన్‌ను ఎన్నికల్లో ఎదుర్కొలేక టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పడి వస్తున్నాయన్నారు. అయినప్పటికి ప్రజలు బుద్ధి చెప్పి కూటమిని తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని గణేష్ చెప్పారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి.. బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్‌ను, రేపల్లె అసెంబ్లీ అభ్యర్థి తనను ఫ్యాను గుర్తుపై ఓటు వేసి, గెలిపించాలని కోరారు. తొలుత అంకమ్మతల్లి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ గణేష్‌ను, ఎంపీటీసీ మోపిదేవి హరనాథబాబును గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఈవూరు కేశవతి, మాజీ జెడ్పీటీసీ ప్రసాదం వాసుదేవ, ఎంపీటీసీ నాజర్‌ఖాన్, పల్లవ సేన సంక్షేమ సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు మోపిదేవి శివనాగరాజు, నాగబాబు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపు వైఎస్సార్ సీపీదే

ఎన్నికల ప్రచారంలో అద్దంకి అసెంబ్లీ అభ్యర్థి చిన హనిమిరెడ్డి



ప్రజలతో మమేకమైన చిన హనిమిరెడ్డి

సంతమాగులూరు (అద్దంకి): రాబోయే ఎన్నికల్లో గెలుపు వైఎస్సార్ సీపీదేనని..నియోజకవర్గ ప్రజల అభిమానమే దీనిని రుజువు చేస్తోందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని కామేపల్లి గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి, అద్దంకి ఎమ్మెల్యేగా తనను, బాపట్ల ఎంపీగా నందిగం సురేష్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఆయనకు గ్రామస్తులు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా చిన హనిమిరెడ్డి మాట్లాడారు. ప్రజారంజక పాలన ఎవరు అందించారో ప్రజలే తెలుసుకోవాలన్నారు. సీఎం వైఎస్ జగన్ హామీలను నెరవేర్చి, ఇవ్వని వాటిని కూడా ప్రజలకు అందించి చరిత్రలో నిలిచిపోయారన్నారు. ఆయన్ను మరలా సీఎంను చేసుకోవాలన్నారు. జిమ్మిక్కులతో, మాయ మాటలతో గెలవాలనుకునే ప్రతిపక్షాలకు ఈ ఎన్నికలు ఒక గుణపాఠం కానున్నాయని పేర్కొన్నారు. అద్దంకి ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానని చిన హనిమిరెడ్డి హామీ ఇచ్చారు. ఎవరెన్ని తప్పుడు ప్రచారాలు చేసినా.. ప్రజలు నమ్మరని రాబోయే ఎన్నికల్లో తాను గెలిచి తీరుతానని దీమా వ్యక్తం చేశారు. గ్రామాలకు గ్రామాలు వైఎస్సార్ సీపీలో చేరుతున్న విషయాన్ని ఆయన ఉటంకించారు. ఈ ప్రచార కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బెజవాడ బెబ్బులి వంగవీటి మోహన రంగా

వైఎస్సార్ సీపీ బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్



చావలి ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎంపీ నందిగం సురేష్

చావలి(వేమూరు): వంగవీటి మోహనరంగాను హత్య చేయించింది నారా చంద్రబాబు నాయుడని వైఎస్సార్ సీపీ బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్ ఆరోపించారు. మండలంలోని చావలి గ్రామంలో ఆయన శనివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. కాపు నాయకుల సమస్యల కోసం పోరాటాలు చేసిన ముద్రగడ పద్మనాభంను అనేక విధాలుగా హింసించింది చంద్రబాబు నాయుడని విమర్శించారు. వైఎస్సార్ సీపీకి, కాపులకు మంచి అనుబంధం ఉందన్నారు. చంద్రబాబునాయుడు పవన్ కల్యాణ్‌ను తన అవసరం కోసం ఉపయోగించుకుంటున్నారని, ఎన్నికల అనంతరం అసలు లెక్కచేయరన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కాపు సామాజికవర్గ నాయకులకు వైఎస్సార్ సీపీలో ఎన్ని సీట్లు ఇచ్చారో.. పవన్ కల్యాణ్‌కు చంద్రబాబు నాయుడు ఎన్ని సీట్లు ఇచ్చారో అన్న విషయాన్ని కాపులు ఒక్కసారి ప్రశ్నించుకోవాలని ఎంపీ కోరారు. వైఎస్సార్ సీపీలో సీఎం జగన్ కాపులకు ప్రాధాన్యం కల్పించారని, చంద్రబాబు తెలుగు దేశంలో కాపులకు సరైన స్థానం కల్పించక పోగా.. వారు రాజకీయంగా ఎదగకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. వంగవీటి రాధ తెలుగుదేశంలోనే పనిచేస్తున్నారని, ఆయనకు ఇంతవరకు సీటు ఇవ్వలేదన్నారు. కాపుల మీద ప్రేమ ఉంటే రాధకు ఎందుకు సీటు ఇవ్వలేదని ఎంపీ నందిగం సురేష్ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యల్లమాటి మోహన్, జెడ్పీటీసీ గాజుల హేమలత, పెరికల పద్మారావు, భాను ప్రకాశ్, వెంకటేశ్వరరావు, మోహన్, మోదుకూరి హరిబాబు, గోపాలం రాము, గాజుల చిన్న భాను, సిరాజ్, దాసరి ముత్తయ్య, అమర్తలూరు సాంబశివరావు, ఎంపీపీ రావర్ల నరేంద్ర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి

డ్వామా పీడీ రాజేష్



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ రాజేష్

బల్లికురవ: ఉపాధి హామీ పథకం పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని డ్వామా పీడీ ఎస్.రాజేష్ ఆదేశించారు. శనివారం బల్లికురవ మండలంలోని వేమవరం, సంతమాగులూరు మండలంలోని సజ్జాపురం, కొప్పరం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులు, మస్టర్, యాప్‌లో హాజరును ఆయన పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడారు. వేసవి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగిపోతున్నందున ఉదయం 6 గంటలకే పని ప్రదేశాలకు చేరుకోవాలని సూచించారు. కూలీ రోజుకు రూ.300 తగ్గకుండా పనిచేయాలన్నారు. కూలీలు విధిగా పనిముట్లు తెచ్చుకోవాలన్నారు. పని చేసే ప్రదేశంలో వసతులు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పంట కాల్వలు, నీటి కుంటలు, చెరువుల అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాల వల్ల నీటి నిల్వకు ఇబ్బందులు ఉండవన్నారు. కూలీల హాజరులో అవకతవకలకు పాల్పడితే మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్లపై శాఖ పరంగా చర్యలు తప్పవని పీడీ ఈ సందర్భంగా హెచ్చరించారు.

ఆదర్శ చీరాలగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యం

ఎన్నికల ప్రచారంలో కరణం గీత, గోరంట్ల సుధారాణి



కరపత్రం అందజేస్తున్న కరణం గీత, గోరంట్ల సుధారాణి

చీరాల: రాష్ట్రంలోనే చీరాలను ఒక మోడల్‌గా తీర్చిదిద్దాలన్నదే తమ లక్ష్యమని వైఎస్సార్ సీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ సతీమణి కరణం గీత, ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి కుమార్తె గోరంట్ల సుధారాణి పేర్కొన్నారు. శనివారం మున్సిపాలిటీలోని 29 వార్డులో కరణం వెంకటేష్‌కు మద్దతుగా వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి ఇంటింటికి వెళ్లి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి, గెలిపించాలని అభ్యర్థించారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ.. గత ఐదేళ్లలో చీరాలలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్‌ను, ఎంపీగా నందిగం సురేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వార్డు కౌన్సిలర్ బత్తుల అనిల్, పార్టీ పట్టణాధ్యక్షుడు కొండ్రు బాబ్జి, వైస్ చైర్మన్ జైసన్ బాబు, కౌన్సిలర్లు కీర్తి వెంకటరావు, కంపా అరుణ్, కౌన్సిలర్, క్లస్టర్-2 మహిళా విభాగం అధ్యక్షురాలు గోలి స్వాతి, గోలి రవి, రాష్ట్ర మహిళా జాయింట్ సెక్రటరీ మల్లెల లలిత, కో-ఆప్షన్ సభ్యులు షేక్ ఫాతిమా, వాసిమళ్ల బ్రదర్స్, రూరల్ మండలం మహిళా అధ్యక్షురాలు ఎస్.వెంకటేశ్వరమ్మ, టి.రామయ్య, సుకీర్తన, దుర్గాప్రసాద్, వెంకటేష్, శ్రీను, ప్రసాద్, అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతన్నకు అండగా జగనన్న పాలన

బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి



ఎన్నికల ప్రచారంలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: రైతన్నకు అండగా జగనన్న పాలన కొనసాగిందని, రైతు మోములో చిరునవ్వులు చూసిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీనేనని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని జిల్లెళ్ళమూడి, జమ్ములపాలెం, నరసాయపాలెం గ్రామాల్లో ఆయన శనివారం ముమ్మరంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ధాన్యం మద్దతు ధర కల్పించటంతో ఈ ప్రాంత రైతులు ఎంతో మేలు పొందారని గుర్తుచేశారు. మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుంటే నల్లమడ డ్రెయినేజీ పనులు చేపట్టేందుకు అవకాశం ఉందన్నారు. గత ఐదేళ్లలో ప్రధాన డ్రెయినేజీల్లో పూడికతీత చేపట్టడం వల్ల ముంపునకు గురికాకుండా ఉందన్నారు. వర్షపు నీరు, ఎగ్గువ ప్రాంతాల నుంచి వచ్చిన నీరు నేరుగా సముద్రంలోకి వెళ్లయంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన కృషి వల్లే సాధ్యమైందని ఎమ్మెల్యే రఘుపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గవిని కృష్ణమూర్తి, కటికల యోహోషువా, కొక్కిలిగడ్డ చెంచయ్య, మండే విజయ్‌కుమార్, మోర్ల సముద్రాల గౌడ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించే నాయకులకు గుర్తింపు

వేమూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు



విలేకరులతో మాట్లాడుతున్న వేమూరు అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు

చావలి(వేమూరు): ప్రజా సమస్యలను గుర్తించి, పరిష్కరించే నాయకుడు ఎక్కడైనా పోటీ చేస్తాడని వేమూరు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు అన్నారు. చావలి గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబునాయుడు కొల్లూరు మండలంలో జరిగిన బహిరంగ సమావేశంలో అశోక్‌బాబు ప్యారచూట్‌గా వచ్చాడని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మరి చంద్రబాబు నాయుడు చంద్రగిరి నుంచి కుప్పంకు, నారా లోకేష్ మంగళగిరి ఏ ప్యారచూట్‌లో వచ్చారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సమస్యలను పరిష్కరించే నాయకులను గుర్తించి, అభ్యర్థుల విషయంలో మార్పులుచేర్పులు చేశారని చెప్పారు. టీడీపీ అధికారంలో ఉన్నపుడు జన్మభూమి కమిటీల ద్వారా రాక్షస పాలన చేశారని అశోక్‌బాబు విమర్శించారు. ఈ కార్యక్రమంలో చందోలు డేవిడ్ విజయకుమార్, ఎంపీపీ యల్లమాటి మోహన్, జెడ్పీటీసీ హేమలత, జాలాది రూబేను, భానుప్రకాశ్, వెంకటేశ్వరరావు, దాది సుబ్బారావు, గాజుల మోహన్, గోపాలం రాము, వీరభద్ర శ్రీనివాస్ రెడ్డి, గాజుల చినభాను, ఎస్.లక్ష్మీధర్, గోపాలం శ్రీనివాసరావు, వెంకటరెడ్డియ్య, బొల్లిముంత ఏడుకొండలు యోగనాథ్, సాంబశివరావు, ఎస్.నాగమల్లేశ్వరావు, శిఖా దేవదానం, కూచిపూడి రవి, ప్రవీణ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.